


పీ-4 శిక్షణకు హాజరుకాని 40 మందికి నోటీసులు

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 24న నగరపాలక సంస్థ కార్యాలయంలో పీ-4 శిక్షణకు హాజరుకాని 40 మంది వార్డు కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే శిక్షణలో వార్డు రెవెన్యూ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శుల్లో కొంత మంది ఆలస్యంగా హాజరుకావడంపై సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. సంజాయిషీ సంతృప్తిగా లేనట్టయితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు కమిషనర్ హెచ్చరించారు.

అమ్మకు కత్తిగాట్లు!





ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరగడం లేదు. దాదాపు 90 శాతం ఆపరేషన్లతో ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయిస్తున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. ఈ విషయంలో తీరు మారాలి. సుఖ ప్రసవాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు పెరిగేలా చూడాలి. ఇందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి.

- శాసనసభలో సీఎం చంద్రబాబు నిర్దేశం

- ప్రభుత్వాస్పత్రుల్లో కానరాని సుఖప్రసవాలు
- రిఫరల్‌గా మారుతున్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు
- ప్రాంతీయ ఆస్పత్రుల్లోనూ అదే తీరు
- సిజేరియన్లతో సొమ్ము చేసుకుంటున్న 'కార్పొరేట్' వైద్యులు

జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులు రిఫరల్‌గా మారాయి. పీహెచ్‌సీకి వెళితే సీహెచ్‌సీకి.. సీహెచ్‌సీకి వెళితే ప్రాంతీయ ఆస్పత్రులకు.. అక్కడ నుంచి జిల్లా కేంద్రాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. వైద్య సిబ్బంది అన్ని వేళల్లో అందుబాటులో ఉండకపోవడం, వారి అలసత్వం అమ్మను ఆపదలోకి నెడుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకాలంలో వైద్యం అందక.. ప్రైవేటు ఆస్పత్రికి తరలించే క్రమంలో 108 వాహనాల్లోనూ ప్రసవిస్తున్నారు. ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యాన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు క్యాష్ చేసుకుంటున్నాయి. గర్భిణులు సిజేరియన్లకు అంగీకరించేలా వివిధ కారణాలు చూపుతూ భయపెడుతున్నాయి.

విజయనగరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో 48 పీహెచ్‌సీలు, నాలుగు సీహెచ్‌సీలు, నాలుగు ప్రాంతీయ ఆస్పత్రులు ఉన్నాయి. జనాభా ఆధారంగా గ్రామీణ పీహెచ్‌సీల్లో నెలకు 5 నుంచి 10 ప్రసవాలు, గిరిజన ప్రాంత ఆస్పత్రుల్లో 5 నుంచి 7 ప్రసవాలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కనీసం 5 ప్రసవాలు చేసినా.. ఏడాదికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో 2800కుపైగా ప్రసవాలు జరగాలి. కానీ మనకెందుకులే అనే నిర్లిప్తత గర్భిణులకు శాపంగా మారుతోంది. సకాలంలో వైద్యం అందక మాతా శిశు మరణాలు సైతం సంభవిస్తున్నాయి. దేశంలో అత్యధిక శస్త్రచికిత్సలు జరుగుతున్న రాష్ట్రంలో ఏపీ మూడోస్థానంలో ఉంది. అదే రాష్ట్రంలో విజయనగరం జిల్లా ఐదో స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయంపై శాసనసభలో ఇటీవల సీఎం చంద్రబాబు మాట్లాడు తూ ఆవేదన చెందారు. మార్పు రావాలని వైద్య ఆరోగ్య శాఖకు నిర్దేశించారు.

ప్రభుత్వ వైద్యానికి సంబంధించి ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఆరోగ్య సహాయకులు, ఆశాలు, 108, 104 సిబ్బంది సైతం ఉన్నారు. కానీ సుఖప్రసవాలు మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదు. దీనిపై ప్రజల్లో అవగాహన లేకపోవడం ప్రధాన కారణం. అవగాహన పెంచాల్సిన యంత్రాంగం తమ పని కాదన్నట్టు వ్యవహరిస్తోంది. గత ఏడాది జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో జరిగిన సుఖ ప్రసవాలు కేవలం 776 మాత్రమే. ప్రైవేటు ఆస్పత్రుల్లో 20,501 ప్రసవాలు జరగ్గా 11,999 సాధారణ, 8,502 శస్త్రచికిత్సల ద్వారా ప్రసవాలు చేశారు.

ఆపరేషన్‌కే ప్రాధాన్యం

గర్భిణీకి శస్త్రచికిత్స చేస్తే అందుకు గల కారణాలను రిపోర్టులో స్పష్టంగా రాయాలి కానీ అనారోగ్య కారణాలు చూపుతూ ఇష్టారాజ్యంగా శరీరంపై కత్తిగాట్లుపెడుతున్నారు. ఆరోగ్యశ్రీ ఉన్నా.. అత్యవసరమని చెప్పి శస్త్రచికిత్సలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. సర్జరీ చేసి బిడ్డను ప్రమాదకరంగా బయటకు లాగుతున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో గత మూడేళ్లలో సాధారణ ప్రసవాలు 25 వేలకు మించి జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గర్భిణీని తొలి నుంచి పరిశీలించాలి. ఎప్పటికప్పుడు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పరీక్షలు చేయాలి. ఆశా కార్యకర్తలు నిత్యం పరిశీలించాలి కానీ జిల్లాలో ఈ తంతు సరిగా జరగడం లేదు. శని, ఆదివారాలు వస్తే ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు కనిపించడం లేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. హై రిస్క్ కేసులను ముందుగానే గుర్తించి పెద్దాస్పత్రులకు రిఫర్ చేయాలి కానీ అలా జరగడం లేదు. అందుకే చాలా మంది ప్రభుత్వ ఆస్పత్రుల ముఖమే చూడడం మానేస్తున్నారు.

భారమైనా తప్పదు..

ప్రభుత్వ ఆస్పత్రులకు వెళుతున్న వారికి వైద్య సిబ్బంది నుంచి సరైన సహకారం లేకుండా పోతోంది. అందుకే భారమైనా ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవం చేయిస్తున్నారు. మరోవైపు జాతకాలు, ఇతర నమ్మకాల తోనూ కొందరు ముందస్తు ప్రసవాల వైపు మొగ్గుచూ పుతున్నారు. సుఖ ప్రసవం కోసం ఎవరూ ఎదురుచూడడం లేదు. ఆగస్టు 15, జనవరి 1 వంటి పర్వదినాల నాడు (మిగతా 6వ పేజీలో..)

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- నియామక పత్రాలు అందుకున్న కొత్త మాస్టార్లు



ఎమ్మెల్యే లలితకుమారితో ఎస్.కోటకు చెందిన ఉపాధ్యాయుడు రెడ్డి శివకుమార్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ప్రతిభ చాటి ఉపాధ్యాయులుగా ఎంపికైన వారంతా రాజధాని అమరావతిలో గురువారం కేరింతలు కొట్టారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు. తమ కల నెరవేరి సీఎం నుంచి నియామక పత్రాలు అందుకున్నందుకు ఆనందపడ్డారు. ఇటు జిల్లా ప్రజాప్రతినిధులు కూడా తమ నాయకుడు ఇచ్చిన హామీ నెరవేరినందుకు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా నుంచి కొత్త ఉపాధ్యాయులంతా 40 ప్రత్యేక బస్సుల్లో బుధవారం ఉదయం డెంకాడ నుంచి బయలుదేరి సాయంత్రానికి అమరావతి చేరుకున్న విషయం తెలిసిందే. వారికి అక్కడ ఇబ్బంది లేకుండా ప్రభుత్వం వసతి ఏర్పాట్లు చేసింది. గురువారం నియామక పత్రాలు అందజేసేందుకు భారీ ఎత్తున వేదిక ఏర్పాటు చేసింది. సీఎం చంద్రబాబునాయుడుతో పాటు జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, కోళ్ల లలితకుమారి, బేబీ నాయన, డీఈవో మాణిక్యంనాయుడు తదితరులు హాజరయ్యారు.



హాజరైన మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

విద్యార్థులకు రక్షిత నీరు కరువు

- పాఠశాలల్లో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్లు
- కోట్లాది రూపాయలు వృథా
- కుళాయి, బోరు నీరే గతి
- పట్టించుకోని ప్రభుత్వం



బొబ్బిలి మండలం అలజంగి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ఇది. కొన్ని నెలలుగా పనిచేయడం లేదు. దీంతో ఆ పాఠశాలలో ఉన్న 40 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం అయ్యాక కొళాయి నీటినే తాగుతున్నారు. చాలా రోజుల నుంచి ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదు. దసరా సెలవులు అయ్యేనాటికైనా వాడుకలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



రాజాం/ బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధ జలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు అలంకారప్రాయంగా ఉన్నాయి. రూ.లక్షలు వెచ్చించి పరికరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణను విస్మరించారు. ఒక్క బొబ్బిలి మండలంలో దాదాపు 82 ఆర్వో ప్లాంట్లను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. నిర్వహణ గురించి అటు అధికారులు, ఇటు ఏజెన్సీలు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. జిల్లా అంతా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు కలుషిత నీటిని తాగుతూ కాలం వెళ్లదీస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇళ్ల నుంచి బాటిళ్లతో తాగునీరు తెచ్చుకుంటున్నారు. అవి అయిపోయాక కొళాయి లేదంటే బోరు నీరే గతి అవుతోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాఠశాల విద్యకు సంబంధించి చాలా మార్పులు తీసుకొచ్చింది కానీ మూలకు చేరిన రక్షిత నీటి ప్లాంట్లను మాత్రం వినియోగంలోకి తేలేకపోతోంది. దీనిపై విమర్శలు (మిగతా 6వ పేజీలో..)



బొబ్బిలి: కృష్ణాపురం పాఠశాలలో పనిచేయని ఆర్వో ప్లాంటు

సరస్‌కు పకడ్బందీ ఏర్పాట్లు 5
102 చెరువు పనులకు రూ.56కోట్లతో ఆమోదం 5
పోక్సో కేసులో 20 ఏళ్ల కారాగారం 5
నారాయణ పురం ఆనకట్టకు జలకళ 5

గంజాయి, సైబర్ కేసుల్లో తక్షణ చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టీ

- నిందితులను అరెస్టు చేయాలి
- డీఐజీ గోపీనాథ్ జట్టీ

విజయనగరం క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో గంజాయి, సైబర్ కేసులు నమోదైనప్పుడు నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ అధికారులను ఆదేశించారు. గురువారం విజయనగరం రూరల్ సర్కిల్ కార్యాలయం, ట్రాఫిక్, మహిళా పోలీసు స్టేషన్‌లలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజయనగరం రూరల్, గంట్యాడ పోలీసు స్టేషన్‌లో పరిష్కారం కాకుండా ఉన్న కేసులను త్వరితగతిన ఛేదించాలని, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మహిళల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక అఘాయిత్యాల్లో నిందితులకు శిక్షించబడేలా త్వరితగతిన ప్రాసిక్యూషన్ పూర్తయ్యేలా చూడాలన్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నిబంధనలు చేపట్టాలన్నారు. ఎంవీ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు ఈ-చలానాలు విధించాలన్నారు. ఆయన వెంట ఎస్పీ ఏఆర్ దామోదర్, ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ గోవిందరావు, సీఐలు లక్ష్మణరావు, సూరినాయుడు, ఏబీ లీలారావు, పలువురు ఎస్‌ఐలు ఉన్నారు.

వైసీపీ నేతకు దోచిపెట్టారు

- గ్రోత్ సెంటర్ సమస్యలపై అసెంబ్లీలో ఎండగట్టిన ఎమ్మెల్యే
- భూమిని అడ్డగోలుగా అప్పగించారని బేబీనాయన ఆవేదన
- స్థానికులకు ఉపాధి అవకాశాలు లేవని వివరణ

బొబ్బిలి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని ఏపీఐఐసీ గ్రోత్‌సెంటర్‌లో నెలకొన్న లోటుపాట్లను బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) గురువారం అసెంబ్లీ సమావేశంలో ఎండగట్టారు. ఎన్నాళ్లయినా అభివృద్ధి లేకపోవడం.. స్థానికులకు ఉపాధి చూపకపోవడం.. వైసీపీ నేతకు భూమిని అడ్డగోలుగా అప్పగించడం తదితర పరిణామాలను ప్రస్తావించారు. ఆయన లేవనెత్తిన అంశాలకు మంత్రి టీజీ భరత్ వివరణ ఇచ్చారు. బేబీనాయన ప్రసంగం ఆయన మాటల్లోనే..

'తెలుగువారి అభిమాన నాయకుడు నందమూరి తారకరామారావు చెప్పడంతో 1995లో గ్రోత్‌సెంటరు ఏర్పాటు కోసం మెట్టవలస, ఎం.బూర్జివలస, ఎం.పణుకువలస, గొర్లె సీతారాంపురం, నారాయణప్పవలస, కాశింధొరవలస గ్రామాలకు చెందిన రైతులు కారుచౌకగా భూములిచ్చారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, తమ పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్న సంకల్పంతో వందలాదిమంది రైతులు 1104 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించారు. అయితే పరిశ్రమలన్నీ ఎకరా, రెండెకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రభుత్వ లక్ష్యానికి, ఆశయానికి భిన్నంగా కొంతమంది దురుద్దేశపూర్వకంగా అక్కడ స్థలాలను పొందారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసుకోవడానికి, బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి స్థలాలు దక్కించుకున్నారు. 2023లో వైసీపీ ప్రభుత్వం అప్పటి అధికార పార్టీ నేతకు 30 ఎకరాలను చౌకగా కేటాయించింది. ప్రత్యేకంగా ఓ జీఓను విడుదల చేసి మరీ ఆయనకు కట్టబెట్టారు. అప్పటి అధికార పార్టీకి చెందిన నేత బంధువు ఒకరు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారిగా ఉండడంతో వైసీపీ నేత పెట్టబోయే పరిశ్రమకు వేగావతి నదీజలాలు వాడుకునే వెసులుబాటు (మిగతా 6వ పేజీలో..)



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బోర్డుతో సరిపెట్టేస్తారా?

- చెరువులో పూడ్చిన మట్టిని తొలగించేదెవరు?



చెరువు స్థలంలో బోర్డు ఏర్పాటు

భోగాపురం, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): అమటాం రాయవలస పంచాయతీ జాతీయ రహదారిని ఆనుకొని సర్వే నెంబరు 11/1లో 1.79 ఎకరాల చెరువులో కొంత మేర ఆక్రమణదా రులు పూడ్చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 23న చెరువేదీ?... 24న ఆక్రమణను చూశారు వెళ్లారు శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలకృష్ణ, ఇన్‌చార్జి వీఆర్వో చిట్టిబాబు వెళ్లి చెరువు స్థలంలో 'ప్రభుత్వ భూమి... ఆక్రమణదారులు శిక్షార్హులు' అంటూ ఓ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే పూడ్చేసిన చెరువు ప్రాంతమంతా మెట్టు భూమిలా తయారైంది. పూడ్చిన మట్టిని తొలగించేదెవరు? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తిరిగి చెరువు రూపమివ్వాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ ఎం.రమణమ్మను వివరణ కోరగా ఈ విషయమై ఎంపీడీవో, ఇరిగేషన్ వారికి తెలియపరిచామని, చెరువులో వేసిన మట్టిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మన ఊరు బాగుండాలంటే.. మనమే ముందడుగు వేయాలి

- రోజుకు గంట పాటు సేవ చేయాలి
- కలెక్టర్ రామసుందర్ రెడ్డి



చెత్త, పిచ్చిమొక్కలను వాహనంలో వేయడానికి తీసుకెళ్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మన ఊరును మనమే బాగు చేసుకుందాం. అందుకు మనమే ముందడుగు వేద్దాం అని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సూచించారు. రోజూ ఓ గంట శ్రమించి పరిసరాలను శుభ్రం చేస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు రోగాలను దూరం చేయవచ్చని చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలో గురువారం స్వచ్ఛత హై సేవ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రామసుందర్ రెడ్డి, జేసీ సేతు మాధవన్‌తోపాటు జిల్లా స్థాయి అధికారులంతా కలిసి కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించారు. కలెక్టరు, జేసీలు స్వయంగా చేతులకు గ్లౌజ్‌లు వేసుకుని చెత్తను ఏరి వాహనంలో వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజుకో గంట కేటాయించడం ద్వారా మన ఊరును మనమే బాగు చేసుకుందామని సూచించారు. మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో కొంతమంది చెత్తను పారిశుధ్య కార్మికులకు ఇవ్వకుండా కాలువుల్లోను, రోడ్డు పక్కనా వేసేస్తున్నారని, ఈ అలవాటును మానుకోవాలని కోరారు.

నేటి నుంచి డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ

చీపురుపల్లి, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం రెండో విడత ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం అవుతుందని ప్రిన్సిపాల్ పీవీ కృష్ణాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగల్ మేజర్ విధానంలో బీఎస్సీలో గణితం, ఫిజిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్సు, బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్, బీఏ పొలిటికల్ సైన్సు, ఎమ్మెస్సీలో ఆర్గానిక్ కెమెస్ట్రీ, కంప్యూటర్ సైన్సు కోర్సులు ఉన్నాయని చెప్పారు. పూర్తి వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నిరుద్యోగ మహిళలకు శిక్షణ

విజయనగరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్టీఆర్ మహిళా సాధికారిత శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మహిళా ప్రాంగణం మేనేజరు బీఆర్ శ్యామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 రోజుల పాటు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, 45 రోజుల పాటు ఎంబ్రాయిడరీ కోర్సు, జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు గల వారు అర్హులని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 26 లోగా శిక్షణ కేంద్రానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కనీస వేతనం ఇవ్వాలి

రాజాం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మెన్లకు రూ.15 వేలు కనీసవేతనంగా అమలుచేయాలని ఆ సంఘ నాయకుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. రాజాంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శానిటేషన్ వర్కర్లు, నైట్ వాచ్‌మన్లకు కనీస వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. పలువురు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పైడితల్లి హుండీ ఆదాయం రూ.3.10లక్షలు

రాజాం రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలిపల్లి పైడితల్లి అమ్మవారికి హుండీలు, ముడుపుల ద్వారా 134 రోజులకు రూ.3లక్షల 10వేల 825 ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈవో బీవీ మాధవరావు తెలిపారు. నవదుర్గ అమ్మవారి దేవస్థానం ఈవో శ్యామలరావు, దేవదాయశాఖ అధికారులు, వంశపారంపర్య ధర్మకర్త దుర్గాప్రసాద్, తదితరుల సమక్షంలో గురువారం హుండీలను తెరిచి లెక్కించామని ఈవో చెప్పారు.

ఎస్పీ బాలుకు నివాళి

గరివిడి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్థంతి సందర్భంగా గురువారం గరివిడిలోని సహాయ పార్క్, టీచర్స్ కాలనీలో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వాకడ శ్రీను, సహాయ్ అధ్యక్షుడు యు.శ్రీను, బొద్దూరి శంకరరావు, బలగ అప్పారావు, సిరిది రాంబాబు, పక్కి శ్రీను, కల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖాదర్‌బాబా జయంతి వేడుకలు

విజయనగరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాబామెట్టలోని ప్రముఖ సూఫీ క్షేత్రం హజరత్ బాబా సయ్యద్ ఖాదర్ షా వలీ దర్గా దర్బార్ మతవల్లీలో శుక్రవారం ఖాదర్‌బాబా 129వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు దర్గా వ్యవస్థాపకులు ఏటీకే-వెలుగు అనాథ వృద్ధాశ్రయం వ్యవస్థాపకుడు డా.మహ్మద్ ఖలీలు బాబు తెలిపారు. ఈ జయంతి మహోత్సవానికి విచ్చేయవలసిందిగా కోరుతూ కలెక్టర్ రామసుందర్‌రెడ్డికి ఆయన గురువారం ఆహ్వానపత్రికను అందించారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించారు.

ఆక్రమణ చేశారని ఫిర్యాదు

పూసపాటిరేగ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కోనాడ గ్రామంలో గల టీడీపీ నాయకుడు దంగా భూలోకపై ఆ గ్రామంలో గల జనసేన పార్టీ నాయకులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 36 సెంట్ల విస్తీర్ణం కలిగిన ఒక కుంటను భూలోక ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకున్నారని వారు తెలిపారు. అదేవిధంగా పక్కనే ఉన్న స్థలాన్ని ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేస్తున్నారన్నారు. ఫిర్యాదు అందజేసిన వారిలో బొడ్డు ఎల్లాజీ, విజ్జపు కిరణ్, పిన్నింటి అప్పలనారాయణ తదితరులు ఉన్నారు.

వరద ఉధృతిపై అప్రమత్తం

మెంటాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంపావతి నది ఉధృతిపై తహసీల్దార్ అరుణకుమారి ఆధ్వర్యంలో రెవెన్యూ బృందాలు అప్రమత్తమయ్యాయి. నదిలో నుంచి ఆగూరు, రెళ్లిగూడెం గ్రామాలకు వెళ్లకుండా రాకపోకలు కట్టడి చేశాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరూ నదిలో ఎవరూ దిగకుండా గురువారం ముళ్లకంచెలు వేయించామని చెప్పారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది ఎల్లవేళల అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

మెరకముడిదాం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సాతాంవలస గ్రామంలో గురువారం ఉద్యాన శాఖ, రాధిక ఆయిల్ కంపెనీ సంయుక్తంగా రైతులకు ఆయిల్‌పామ్ పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా చీపురుపల్లి ఉద్యాన శాఖాధికారి ఎం.అనూష మాట్లాడారు. ఆయిల్‌పామ్ మొక్కలను శాతశాతం రాయితీపై ఉచితంగా రైతులకు అందజేస్తామన్నారు. అలాగే ఒక హెక్టారు ఆయిల్‌పామ్ సాగుకు గరిష్టంగా రూ.29వేలు సబ్సిడీ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సరస్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- వినూత్నంగా పుష్పప్రదర్శన
- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశాలు

విజయనగరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న ప్రారంభం కానున్న అఖిల భారత డ్వాక్రా బజార్ (సరస్-2025)కి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సరస్, ఫలపుష్ప ప్రదర్శన కోసం మాన్సాస్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. సందర్శకులు ఇబ్బంది పడకుండా చూడాలని, ముఖ్యంగా వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. డ్వాక్రా సంఘాలు ఉత్పత్తి చేసిన వస్తువుల ప్రదర్శనలు, అమ్మకాలు సజావుగా జరగాలన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, ఎలక్ట్రికల్ ఎస్ఈ లక్ష్మణరావు, డీఎంహెచ్‌వో జీవనరాణి, ఉద్యానవన శాఖ జేడీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

102 చెరువు పనులకు రూ.56కోట్లతో ఆమోదం

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ ద్వారా రిపేర్, రెనోవేన్, రెస్టొరేషన్(ఆర్‌ఆర్‌ఆర్) కింద రూ.56 కోట్ల అంచనాతో 102 చెరువు పనులకు ఆమోదం లభించిందని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన ఆధ్వర్యంలో ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ నిబంధనలు అనుసరించి జిల్లాలో ఉన్న 7,900 చెరువులు ఉండగా వాటిలో కేవలం 102 చెరువు పనులకే ప్రతిపాదనలు పంపడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలాల వారిగా ఉన్న చెరువులను పరిశీలించి ఈ నిబంధనల కిందకు వచ్చే వాటిని గుర్తించి మరిన్ని ఎక్కువ చెరువులను అభివృద్ధికి కృషి చేయాలని జల వనరులు శాఖ అధికారులకు ఆయన ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ నిబంధనలలోనికి రాని చెరువులు ఏ కారణంగా ఈ పరిధిలోకి రాలేదో కారణాలను కూడా వివరించాలన్నారు. వచ్చే వారానికి మరో 500 చెరువులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జలవనరులు ఈఈ వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

గిరిజన విశ్వవిద్యాలయం పనులను వేగవంతం చేయాలి

కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం నిర్మాణం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో నిర్మితమవుతున్న గిరిజన విద్యాలయం పనులపై గురువారం తన చాంబర్‌లో ఆయన అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 1.3 కిలో మీటర్ల మేర ప్రతిపాదించిన యూనివర్శిటీ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న విద్యుత్ హైటెన్షన్ వైర్లు, గేటు ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెలుపలికి జరిపేందుకు చర్యలు ప్రారంభించాలని, ఈ మేరకు విద్యుత్ శాఖ ఉన్నత అధికారులకు లేఖ రాయాలని సూచించారు. తాగునీటిని సరఫరా చేసే నిర్మాణాలన్ని పూర్తయ్యాయని, పంప్ హౌస్‌లకు విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి తదితరులు ఉన్నారు.

గిరిశిఖర వాసులకు రోడ్డు సదుపాయం కల్పించండి

శృంగవరపుకోట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గిరిశిఖర ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలకు రవాణా సదుపాయం కల్పించాలని స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుడు ఇందుకూరి రఘురాజు గురువారం శాసన మండలిలో ప్రస్తావించారు. రేషన్ బియ్యం కూడా కింది నుంచి నెత్తిన మోసుకుని ఇంటికి తీసుకు వెళ్తున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ గిరిజన గ్రామాలకు రోడ్లు మంజూరవుతున్నాయని, కానీ సకాలంలో పూర్తి కావడం లేదన్నారు. గిరిజనులకు ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు త్వరితగతిన రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

సిరిమానుకు పూజలు

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 25: పైడిమాంబ సిరిమాను, ఇరుసు మానులకు గురువారం పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు నివాసమైన హుకుంపేట వద్ద ఆ మానులను సిరిమానుకు, ఇరుసులకు సంబంధించిన చెక్కుడు పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురు భక్తులు చేరుకుని, పూజలు చేశారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని యూనియన్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆ బ్యాంకు జీఎం శాలిని మీనన్ అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నగరంలోని యూనియన్ బ్యాంకు కంటోన్మెంట్ బ్రాంచ్ వద్ద ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం ఆమె కార్ కార్నివాల్ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారులకు అతి తక్కువ వడ్డీరేట్లకు కార్లపై రుణాలు అందిస్తున్నామని చెప్పారు. బ్యాంకు ఆర్ఎం జితేంద్ర శర్మ, డిప్యూటీ ఆర్ఎంలు శ్రీనివాస్, రాజా, వివిధ శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ యూరియా అందాలి

మెరకముడిదాం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియా అందాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు అన్నారు. భైరిపురం సచివాలయంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. యూరియా పంపిణీపై సిబ్బందిని ఆరా తీశారు. ఎంపీడీవో సుధాకర్ పట్నాయక్, తహసీల్దార్ సులోచనరాణి, ఏవో శ్రావణ్ తేజ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీరాములునాయుడు, గర్భాం పంచాయతీ ఈవో విశ్వనాథం పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధం

మెరకముడిదాం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంఆర్సీ భవనంలో సెమిస్టరు-2, ఎన్టీ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు ఎంఈవో-2 ధర్మ శ్రీను గురువారం తెలిపారు. ఎస్ఆర్‌కేవీఎం-1లో భాగమైన 1 నుంచి 10వ తరగతి వరకు 33 టైటిల్స్‌కుగానూ 20 టైటిల్స్ మండల కేంద్రానికి జిల్లా కేంద్రం నుంచి చేరాయని ఆయన చెప్పారు. మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల రోల్ ప్రకారం టైటిల్స్‌ను తరగతి వారీగా వేరుచేసి పంపిణీకి సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఎన్టీ పుస్తకాలను దసరా సెలవుల అనంతరం పాఠశా లలకు పంపిణీ చేస్తామన్నారు. మిగతా 10 టైటిల్స్‌ను కూడా జిల్లా నుంచి వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు.

ముత్యాలమ్మకు పసుపు కుంకుమలు

వేపాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కొండ గంగుబూడి శివారు సీతారాంపురం గ్రామస్థులు గ్రామ దేవత ముత్యాలమ్మకు గురువారం వారాల పండగను పురస్కరించుకుని పసుపు కుంకుమలు సమర్పించారు. ప్రతిఏటా వరినాట్లు పూర్తయిన తర్వాత ఈ పండగను నిర్వహిస్తూ ఉంటారు. ఈసందర్భంగా నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.


కోలాటం ఆడుతున్న దృశ్యం

సమాజానికి ఒక గంట సేవ చేయండి


విజయనగరం రూరల్: రైతు బజారులో చీపురుతో ఊడ్చుతున్న మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్



పూసపాటిరేగ: శుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థినులు, ఉపాధ్యాయులు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా ఐ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని రింగురోడ్డు రైతు బజారులో గురువారం శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ ఏడీ బి.రవికిరణ్ అక్కడ రైతులతో కలిసి చీపురు పట్టుకుని రైతు బజారును శుభ్రపరిచారు. స్వచ్ఛతా ఐ సేవా కార్యక్రమంలో ఏక్ దిన్ ఏక్ గంటా, ఏక్ సాథ్ నినాదంతో అందరూ సమాజానికి రోజుకి ఒక గంటైనా సేవ చేయాలని ఆయన సూచించారు. ఎస్టేట్ ఆఫీసర్లు ఉమా, సతీష్, మార్కెటింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రతపై అవగాహన

పూసపాటిరేగ: స్వచ్ఛ దివస్‌ను పురస్కరించుకుని స్థానిక కోనాడ జంక్షన్ వద్ద గల ఆర్టర్ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థినులు గురువారం కొత్తకొప్పెర్ల గ్రామంలో చెత్తను ఏరే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పలు చోట్ల ఉన్న చెత్తను ఏరి.. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్యామలరావు, ఉపాధ్యాయులతో పాటు స్థానిక సర్పంచ్ ఎస్.సత్తిబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఆకిరి ప్రసాదరావు, ఉప సర్పంచ్ ఎల్.రాజారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

డెంకాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వరి యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ప్రతి రైతూ తమ వరి పొలాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, వరిపంటపై వచ్చే సుడిదోమ అతి ప్రమాదకరమని విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విజయనగరం డివిజన్ ఏడీఏ నాగభూషణరావు, డెంకాడ మండల వ్యవసాయాధికారి సంగీత, శాస్త్రవేత్తల బృందంతో కలిసి వరి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంటలో ఎక్కువగా ఎర్రబడడం గమనించామని, ఇది పొటాష్ లోపంగా గుర్తించామన్నారు. కొన్ని చోట్ల నత్రజని లోపం కూడా గుర్తించినట్టు తెలిపారు. దీని నివారణకు ఎకరా వరి పొలానికి యూరియా 30 కిలోలు, పొటాష్ 15 నుంచి 20 కిలోలు కలిపి వేయాలన్నారు. వరిపంటలో అక్కడక్కడా దోమపోటు గమనించామని, దీని నివారణకు ఒక లీటరు నీటికి బుప్రోఫెజిన్ 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలని ఆయన వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరావు, పాణిరాజు, శ్రీకాకుళం వ్యవసాయ పరిశోధన కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం కీలక తీర్మానాలు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ మండల సంఘం కీలక తీర్మానాలు చేసింది. గురువారం స్థానిక సంఘ భవనంలో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ కొడూరు శ్రీనివాసరావు పాల్గొని, మాట్లాడారు. ఎస్.కోట మండల పరిధిలో కొత్త సెలూన్ ఏర్పాటుకు మండల సంఘం అనుమతి, ఈ దుకాణాల్లో పనిచేసేవారు మండల పరిధిలో ఉన్న షాపులలో ఒక ఏడాది పనిచేసి ఉండాలని, బార్బర్ షాపు ఏర్పాటుచేసే వారు నాయీ బ్రాహ్మణులు అయి ఉండాలని, షాప్ ఏర్పాటుచేసే వారు సంఘానికి రూ.10వేలు సభ్యత్వం చెల్లించాలని ఇతర తీర్మానాలను వివరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బొండపల్లి శివ, చీపురుపల్లి గణేష్, మల్లువలస సన్యాసిరావు, బొండపల్లి గణేష్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి కృషి చేయాలి

గుర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశ అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద సుహాసిని కొమరగిరి అన్నారు. పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా స్థానిక అమ్మాజీ కల్యాణ మండపంలో గురువారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోలిపల్లి కనకరాజు ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని, మాట్లాడారు. భారతీయ జనసంఘ్‌ను ఆదర్శవంతమైన రాజకీయ పార్టీగా రూపొందించిన జాతీయ నాయకుడు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు పతివాడ రాజేష్, వేమకోటి గిరిబాబు, నెల్లిమర్ల కౌన్సిలర్ మండల పార్టీ అధ్యక్షుడు ప్రసాదు, చందక గోవిందు, కొండపల్లి శ్రీనివాసరావు, మహేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి సుహాసిని

ఓటర్ల జాబితాపై సమీక్ష పూర్తిచేయాలి

నెల్లిమర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా 2002పై సమీక్ష ప్రక్రియను బీఎల్వోలు త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ కె.శ్రీకాంత్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని బీఎల్వోలతో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు ఆధ్వర్యంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా 2002 సమీక్ష, ఆ జాబితాలో 2005 ఓటర్ల జాబితా బేరీజు ప్రక్రియను శుక్రవారం నాటికి శతశాతం పూర్తిచేసి నివేదికలను తనకు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురం ఆనకట్టకు జలకళ

ఎగువ నుంచి వరద నీరు రావడంతో పాటు మడ్డు వలస రిజర్వాయర్ నుంచి నీరు విడిచిపెట్టడంతో రంగా రాయిపురం వద్ద నారాయణపురం ఆనకట్ట జలకళ సం తరించుకుంది. ఆనకట్ట వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొనడంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది.

- సంతకవిటి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి)



మా గోడు అసెంబ్లీలో వినిపించండి

- కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్ సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే లలితకుమారి అమ్మగారు.. మా గోడు అసెంబ్లీ సమావేశాల్లో వినిపించండి' అని జిందాల్ నిర్వాసితులు కోరారు. గురువారం బొడ్డవర గ్రామం వద్ద వారు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటికే శాసనమండలి ద్వారా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తమ పోరాటాన్ని వివరించారని అలాగే ఎమ్మెల్యే కూడా వివరించి తమ భూములు తమకు వెనక్కి వచ్చేలా చేయాలని వారు కోరారు. తమ సమస్యపై సీఎం, డిప్యూటీ సీఎం స్పందించాలన్నారు.



నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

వృద్ధుడి హత్య

- భూ వివాదంతో కక్షగట్టి చంపేసిన తనయుడు


నాయుడు (ఫైల్)

బొండపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకిందాం గ్రామంలో తండ్రి హత్యకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పెదమజ్జి నాయుడు(72)ను కుమారుడు గణేష్‌కుమార్ గునపాంతో పొడిచి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 15 రోజుల కిందట తండ్రీ కొడుకు మధ్య భూ వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఇద్దరి మధ్య జరిగిన పెనుగులాటలో తండ్రి కాలు విరిగిపోయింది. అప్పటి నుంచి గొడవలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి మరోసారి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ సమయంలో గణేష్‌కుమార్ పక్కనే ఉన్న గునపాం తీసుకుని తండ్రిని పొడిచేశాడు. రక్తపు మడుగులో తండ్రి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై అందిన సమాచారంతో ఎస్ఐ యు.మహేష్ గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు.

కాలువలో పడి తాపీమేస్త్రీ గల్లంతు

బొబ్బిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ వర్రి మధు(25) గురువారం వెంగళరాయసాగర్ కాలువలో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగి గల్లంతయ్యాడు. ఏఎస్ఐ బి.కొండలరావు తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లికి దాడయ్యకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు మధు వెంగళరాయసాగర్ కాలువలో స్నానం చేసేందుకు ఉదయం వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో సాయంత్రం 4 గంటల సమయంలో కుటుంబ సభ్యులు కాలువ గట్టుకు వెళ్లి పరిశీలించారు. కాలువ గట్టుపైన సైకిల్, అతడి దుస్తులు ఉన్నట్టు గుర్తించారు. మధు ఆచూకీ తెలియకపోవడంతో దాడయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ కటకం సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని మహిళ మృతి

గరుగుబిల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శివ్వాం గ్రామానికి చెందిన నల్లకాంతం దమయంతి (59) మృతి చెందింది. ఆమెకు మతిస్థిమితం లేదు. మూడు రోజులుగా దమయంతి కనిపించడం లేదని గరుగుబిల్లి ఎస్ఐ ఫక్రుద్దీన్‌కు ఆమె కుటుంబ సభ్యుడు చంద్రరావు ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. చివరికి గురువారం ఉదయం శివ్వాం సమీపంలోని నాగావళి నదిలో మృతదేహం ఉందన్న సమాచారంతో ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆ మృతదేహం దమయంతి అని గుర్తించారు. మృతిరాలి భర్త జగన్నాథం 20 ఏళ్ల క్రితం మృతి చెందడంతో ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆమెకు మతి స్థిమితం లేకపోవడంతో పాటు మూర్ఛ వ్యాధి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరు..

లక్కవరపుకోట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లివీడు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నపాలెం గ్రామానికి చెందిన వనుము ఈశ్వరరావు (57) తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. లింగంపేట గ్రామంలో పండగ కోసం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కుక్క అడ్డంగా రావడంతో ఈ ప్రమాదం సంభవించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో 2025 ఏప్రిల్ నెలలో నమోదైన పోక్సో కేసులో విజయనగరం పట్టణం మేదర వీధికి చెందిన గ్రంది పైడిరాజు(అలియాస్ రాజు)కు 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి తీర్పును వెలువడించారు. అలాగే బాధితురాలికి పరిహారంగా రూ.2లక్షలు మంజూరు చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్ స్టేడియం మేదర వీధికి చెందిన గ్రంది పైడిరాజు అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికపై ఈ ఏడాది ఏప్రిల్ 16న ద్విచక్రవాహనంపై వేరే ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ గోవిందరావు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేయగా నిందితుడు పైడిరాజుపై నేరారోపణ రుజువు కావడంతో న్యాయాధికారి కె.నాగమణి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధించారు. ఈ కేసులో క్రియాశీలంగా వ్యవహరించిన డీఎస్పీ గోవిందరావు, ఎస్ఐ నరసింగరావుతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పశువుల కాపరి మృతదేహం లభ్యం

మెంటాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మెంటాడకు చెందిన పశువుల కాపరి చల్ల కృష్ణ ఈనెల 23న ప్రమాదవశాత్తు చంపావతి నదిలో పడిపోయిన విషయం తెలిసిందే. ఈయన ఆచూకీ కోసం గత రెండు రోజుల నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు చేసిన ప్రయత్నాలు గురువారం ఫలించాయి. నది ప్రవాహం ఉధృతి కాస్త తగ్గడంతో కృష్ణ మృతదేహం లభ్యమైంది. ఈ మృతదేహాన్ని ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ భాస్కరరావు బాధిత కుటుంబానికి అప్పగించారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

కురుపాం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలైన సందుబడి, తంబళబాయి, రేగులపాడు తదితర గ్రామాల్లోని సారా తయారీ కేంద్రాలపై రెండు రాష్ట్రాల ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. 730 లీటర్ల సారాతో పాటు తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. 9700 లీటర్లు బెల్లంఊటలు ధ్వంసం చేశారు. ఈసందర్భంగా కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రా- ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సారా తయారీ చేసి ఆంధ్రాకు సరఫరా చేస్తున్నారన్నారు. దాడుల్లో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

కొత్తవలస, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. ఏదైనా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న వ్యక్తి మృతిచెందితే ఉదయం 10.30 నిముషాలకు కాకుండా సాయంత్రం 4గంటల తర్వాతే నివాళి అర్పించాలని ఆదేశాలు జారీ చేస్తూ హైకోర్టు సర్క్యులర్ జారీ చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ విధులను బహిష్కరించామని న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి తెలిపారు. ఈ మేరకు స్థానిక న్యాయాధికారి సముద్రాల విజయచందర్‌కు వినతిపత్రం అందజేశారు.

అమ్మకు కత్తిగాట్లు!

(మూడో పేజీ తరువాయి)

ప్రసవాలు చేయించిన వారూ ఉన్నారు. పెద్దల పేరిట సెంటిమెంట్ అని ఒకరు.. చనిపోయిన పూర్వీకుల పుట్టిన రోజు అని మరొకరు.. ఇలా ముందస్తు ప్రసవాలకు మొగ్గుచూపుతున్నారు. అటు కాసుల కక్కుర్తిపడుతున్న వైద్యులు సైతం ప్రసవాల కోసం వెళుతున్న వారి మైండ్‌లో ఏవేవో ఆలోచనలు కలిగిస్తున్నారు. దీంతో కుటుంబసభ్యులు సైతం సుఖ ప్రసవాలు అన్న విషయాన్నే మరిచిపోతున్నారు. సాధారణంగా ఆస్పత్రులకు వెళుతుంటే 'రక్తం తగ్గిందని, బిడ్డ ఉమ్మనీరు తాగేసిందని, బరువు ఎక్కువగా ఉందని, రక్తపోటు అధికమైందని, బిడ్డ అడ్డం తిరికిందని' ఇలా రకరకాల కారణాలు చెబుతూ అమ్మ కడుపుకు కత్తి గాట్లు పెడుతున్నారు. లక్షల రూపాయల ఫీజులూ వసూలు చేస్తున్నారు.

సుఖ ప్రసవాలపై ఆదేశాలిచ్చాం..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు పెరగాలి. కచ్చితంగా దీనిని పాటించాలని ఆదేశాలిచ్చాం. వీలైనంత వరకూ సుఖ ప్రసవాలు చేయాలి. తల్లీబిడ్డ ఆరోగ్యానికి ఇబ్బందని తెలిస్తేనే ఆపరేషన్లు చేయాలి. ముందస్తు ప్రసవం అనేది తల్లీబిడ్డల అనారోగ్యానికి ఒక హేతువు. ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప.. ముహూర్తాలకు ప్రసవాలు చేయించడం నేరం. వీలైనంత వరకూ సుఖ ప్రసవాల కోసం ఎదురుచూడాలి. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెరగాలి.

-జీవనరాణి, డీఎంహెచ్‌వో, విజయనగరం

విద్యార్థులకు రక్షిత నీరు కరువు

(మూడో పేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి వైసీపీ అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో తొలి విడత 'నాడు-నేడు' పథకంలో భాగంగా 841 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు మంజూరయ్యాయి. కానీ 680 పాఠశాలల్లో మాత్రమే ఏర్పాటుచేశారు. ఇందుకుగాను అప్పట్లో రూ.183 కోట్లు ఖర్చుచేశారు. రెండో విడతలో 738 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు మంజూరుకాగా.. రూ.231 కోట్లు ఖర్చుచేశారు. రెండు విడతల్లో కలిపి ఆర్వో ప్లాంట్ల నిర్మాణానికి రూ.400 కోట్లు ఖర్చుచేసినట్టు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా ఈ ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు. దీంతో తాగునీటి కోసం విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. చేతిపంపు కాని కుళాయిల నీటిని కాని తాగుతున్నారు. ఏడాదిన్నరగా ఇదే పరిస్థితి ఉన్నా బాగుచేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం మెనూ అమలుచేస్తోంది. అయితే విద్యార్థులకు అత్యవసరమైన తాగునీటి అంశాన్ని నిర్లక్ష్యం చేయడం విమర్శలకు తావిస్తోంది.

విద్యార్థుల సంఖ్యను బట్టి..

వైసీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యబట్టి ఆర్వో ప్లాంట్లను ఏర్పాటుచేశారు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకూ ఖర్చుచేశారు. విద్యార్థులకు ఫ్లోరైడ్, ఇతర సమస్యల నుంచి విముక్తి కల్పించేందుకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేసినట్టు ఆ ప్రభుత్వం ప్రకటించింది కానీ నిర్వహణను చూడలేకపోయింది. దీంతో రకరకాల కారణాలతో ప్లాంట్లు మూలకు చేరాయి. ఆహ్లాద ఇంజనీర్స్ లిమిటెడ్, ఇన్నోవేటివ్ ఇండస్ట్రీస్, లివ్‌ప్యూర్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి పలు కంపెనీల నుంచి ఆర్వో ప్లాంట్లను తెప్పించారు. అప్పట్లో సాంకేతిక సిబ్బందిని సైతం అందు బాటులో ఉంచారు. అయినా నిర్వహణను సరిగా చూడలేకపోయారు. ప్లాంట్లు పనిచేయడం లేదని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు ఫోన్ చేస్తుంటే టెక్నికల్ సిబ్బంది స్పందించడం లేదు. దీంతో హెచ్‌ఎంలు సైతం మౌనం దాల్చాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టిసారించాల్సిన అవసరముంది. లేకుంటే వందల కోట్లు విలువచేసే ఆర్వో ప్లాంట్లు దేనికీ పనికిరాకుండా పోయే పరిస్థితి ఉంది.

దృష్టిసారించాం

ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. వాటికి మరమ్మతులు చేస్తాం. ఇప్పటికే సంబంధిత కంపెనీ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

- యు.మాణిక్యాలనాయుడు, డీఈవో, విజయనగరం

వైసీపీ నేతకు దోచి పెట్టారు

(మూడో పేజీ తరువాయి)

కల్పించారు. వేగావతి నది ఇప్పటికే సాగు, తాగునీటి అవసరాలను తీర్చలేకపోతోంది. గ్రోత్‌సెంటరులో పరిశ్రమలకు అవసరమైన నీటిని తోటపల్లి లేదా ఇతరత్రా ప్రాజెక్టుల నుంచి అందివ్వాలి. పవర్ సబ్సిడీని గతంలో మాదిరిగా ఇవ్వాలి.

● గ్రోత్‌సెంటరులో పరిశ్రమల నిర్వాహకులకు ఏదైనా సమస్య చెప్పుకోవాలంటే విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం నగరాలకు పరుగులు తీయాల్సిన దౌర్భాగ్యపు పరిస్థితి నెలకొంది. యుద్ధప్రాతిపదికన ఇక్కడ పర్మినెంట్ అధికారులను, సిబ్బందిని నియమించకపోతే ఉన్నకొద్దిపాటి పరిశ్రమలు సైతం తరలిపోయే ప్రమాదం ఉంది.

● భూములు ఇచ్చిన రైతుల పిల్లలకు అవసరమైన అర్హత కలిగి ఉన్నప్పటికీ పరిశ్రమల యజమానులు చత్తీస్‌గఢ్, ఒడిశా, బీహార్ తదితర ప్రాంతాల నుంచి కార్మికులను పనిలోకి తీసుకుంటున్నారు. ఇది చాలా అన్యాయం. నైపుణ్య శిక్షణ ఇచ్చి స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించేలా చూడాలని' ప్రభుత్వాన్ని బేబీనాయన కోరారు.

● ఎమ్మెల్యే ప్రసంగానికి స్పందించిన స్పీకరు అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ బొబ్బిలిలో ఓ మంచి కార్యక్రమం పెట్టి పరిశ్రమల మంత్రిని ఓసారి బొబ్బిలికి ఆహ్వానించి సమీక్ష జరిపించాలని సూచించారు.

● ఎమ్మెల్యే బేబీనాయన గ్రోత్‌సెంటరు సమస్యలపై లేవనెత్తిన అంశాలకు పరిశ్రమల మంత్రి టీజీ భరత్ సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. గ్రోత్‌సెంటర్‌ను విజిట్ చేసి సమీక్ష జరుపుతామన్నారు. నీటి సమస్య కోసం ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ హయాంలో అక్రమంగా ఇచ్చిన భూ కేటాయింపును రద్దు చేశామని, దీనిపై మరోసారి పరిశీలిస్తామన్నారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చినమోసూరువలస, చిలకమ్మవలస గ్రామాల్లోని గిరిజనులకు గురువారం బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు దుస్తులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు మరడ రామినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను డోలీల్లో తరలించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు మామిడి ధర్మారావు ఓ గర్భిణికి చీర, పౌష్టికాహారం కోసం ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి, మాజీ సైనికులు రెడ్డి రామకృష్ణ, ఎస్.ఆర్.మోహనరావు, అలుగోలు గోవిందనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అలజంగి, పిరిడి, పక్కి ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల నిమి త్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని బొబ్బిలి ఏఈ రఘు ప్రకటనలో తెలిపారు. పక్కి, కారాడ, అలజంగి, పిరిడి గ్రామాలకు ఇతర ప్రాంతాల నుంచి అవకాశం ఉన్న ఏరియాలకు విద్యుత్ సరఫరా ఇవ్వనున్నామన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి

బాడంగి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ ఎ.సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన బాడంగిలో విలేకరులతో మాట్లాడారు. గత నాలుగు నెలలుగా భోజన కార్మికులకు జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బకాయి జీతాలను తక్షణమే చెల్లించని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూలు ఆయాలు బి.సింహాచలం, జి.సుజాత, ఎం.అరుణ, జి.గౌరమ్మ, జి.మంగ, కె.రాధ పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు పదవీ గండం

● ఆర్డీవోకు భామిని టీడీపీ సభ్యుల అవిశ్వాస తీర్మానం నోటీసు



ఆర్డీవోకు నోటీసు అందజేస్తున్న టీడీపీ నాయకులు

బొబ్బిలి /బాడంగి సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని బాడంగి ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు పదవీ గండం ప్రమాదం ముంచుకొచ్చింది. వైసీపీకి చెందిన ఎంపీపీ బోగి గౌరి, వైస్ ఎంపీపీ బొమ్మినాయని రమేష్‌లపై తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. గురువారం టీడీపీ మండల నాయకులు బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావుకు నోటీసును అందజేశారు. దీన్ని కలెక్టరుకు నివేదిస్తామని ఆర్డీవో తెలిపారు. నోటీస్ అందజేసిన వారిలో వైస్ ఎంపీపీ-2 సింగిరెడ్డి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, మాజీ ఎంపీపీ బొంతు త్రినాథనాయుడు ఉన్నారు. బాడంగి మండలంలో 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా గత మండల ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ చెరో ఏడు సీట్లను గెలుచుకున్నాయి. అప్పట్లో లాటరీ వేయడంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులు వైసీపీకి దక్కాయి. కోడూరు, గూడెపువలస ఎంపీటీసీ సభ్యులు టీడీపీలో చేరడంతో వారి బలం 9కి చేరింది. వీరితో పాటు మరి కొంతమంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులు టీడీపీకి మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. ఎంపీపీ గౌరి, వైస్ ఎంపీపీ రమేష్‌లపై అవిశ్వాసం నెగ్గితే బొత్సవానివలస టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు యజ్జల లక్ష్మిని ఎంపీపీ పదవి వరించనుంది. వైస్ ఎంపీపీ పదవి రేసులో గజరాయునివలస ఎంపీటీసీ పాలవలస గౌరుతో మరికొంతమంది రేసులో ఉన్నారు.

ఘనంగా ఫార్మసిస్ట్ డే



ర్యాలీకి జెండా ఊపుతున్న తూముల భాస్కరరావు

బొబ్బిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫార్మసిస్ట్ డేని పురస్కరించుకుని కోమటిపల్లి భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల చైర్మన్ తూముల భాస్కరరావు జెండా ఊపి ప్రారంభించారు. రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి గాంధీబొమ్మ జంక్షన్, వేణుగోపాలస్వామి గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొణతాల రాజేశ్ మాట్లాడుతూ మందుల వినియోగం, వాటి ప్రభావం, దుష్ప్రభావం వంటి అంశాలపై మాట్లాడారు. మందుల తయారీలో ఫార్మసిస్టుల బాధ్యతాయుతమైన పాత్రను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, సాయికుమార్, కృష్ణవేణి, అప్పలనాయుడు, తిరుపతినాయుడు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు బోధించండి



బొబ్బిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బొబ్బిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బొబ్బిలి సీఐ కటకం సతీష్‌కుమార్ అన్నారు. రోటరీ జిల్లా అధ్యక్షుడు జేసీ రాజు ఆధ్వర్యంలో గురువారం బొబ్బిలిలో ప్రాతిపదిక విద్య-అక్షరాస్యత అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో యువత గాడితప్పుతోందన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొందన్నారు. వారందరికీ నైతిక విద్యను అందించాలన్నారు. తల్లిదండ్రులను, సమాజాన్ని యువతీయువకులు అమితంగా ప్రేమించే విధంగా ఉండాలన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటివి జోలికి యువత పోరాదన్నారు. బెట్టింగ్ మహమ్మారికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చింతా అప్పారావు, ప్రిన్సిపాల్ వంశీ, రోటరీ ప్రతినిధులు రామకృష్ణ, చినబాబు, చందు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



చెక్‌పోస్టులో వాహనాన్ని డీఎస్పీ

రామభద్రపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి ఇన్‌చార్జి డీఎస్పీ రాఘవులు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఫేక్ కాల్స్‌పై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడపడం వలన ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. వాహనదారులు విధిగా రహదారి నిబంధనలను పాటించాలన్నారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా నేరమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈగల్ టీమ్‌ల ద్వారా గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ వివరించారు.

అనంతరం ఆయన కొట్టక్కి వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. గంజాయి రవాణా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం పలు వాహనాలను డీఎస్పీ తనిఖీ చేశారు. ఆయన వెంట బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు ఉన్నారు.

భూసమస్యలను తక్షణమే పరిష్కరించాలి

బొబ్బిలి రూరల్ ,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీను వీఆర్వోలను ఆదేశించారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. భూ రీసర్వే, హౌసింగ్, జీవో ప్రకారం అందరికీ ఇళ్లు, పట్టాదార్ పాస్‌పుస్తకాలు పంపిణీ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో భూ సమస్యలపై దృష్టి సారించి రైతులకు సకాలంలో పరిష్కరించాలన్నారు. మ్యూటేషన్‌లు సక్రమంగా ఉంటేనే అంగీకరించాలన్నారు. ఎక్కడైనా సమస్య వస్తే తమకు తెలియజేయాలన్నారు. సమావేశంలో హెచ్‌డీటీ సుబ్బారావు, ఈఆర్‌వో గౌరిశంకరరావు, ఆర్ఐ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కాత్యాయనిదేవిగా దాడితల్లి అమ్మవారు

బొబ్బిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం గొల్లపల్లి దాడితల్లి అమ్మవారిని కాత్యాయినిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతబొబ్బిలి, గొల్లపల్లి, సంఘవీధి, రావువారి వీధులలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మహిళలంతా పెద్దసంఖ్యలో అమ్మవారికి పూజలు చేశారు. ●బొబ్బిలి రూరల్ , సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు గురువారం దిబ్బగుడ్డివలస, కృష్ణాపురం గ్రామాల్లో కొలువైన అమ్మవారు కాత్యాయనీదేవి భక్తులకు ధర్శనమిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

బొబ్బిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా స్థానిక శ్రీషిర్డీసాయి మందిరంలో బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. విద్యుత్ అలంకరణతో ఏర్పాటు చేసిన ఈ కొలువును తిలకించేందుకు భక్తులు ఆసక్తి కనబరుస్తున్నారు.

బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

బొబ్బిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో నూతనంగా నిర్మించిన రైల్వేస్టేషన్ భవనాలు, ఫ్లైఓవర్ బ్రిడి , ఇతర నిర్మాణాలను గురువారం రెండో రోజు రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించారు. విజయనగరం-రాయగడ మార్గంలో బొబ్బిలి నుంచి సీతానగరం వరకు నూతనంగా నిర్మించిన మూడో రైలు మార్గాన్ని సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్ కుమార్ మిశ్రా తనిఖీ చేశారు. బొబ్బిలి రైల్వే మార్గంలో 14 కిలోమీటర్ల విద్యుదీకరణ పనులను ఆయన పరిశీలించారు. నూతనంగా నిర్మించిన రైల్వేలైన్, బ్రిడ్జిలు, వాటిపై రైళ్ల రాకపోకలు, వాటి సామర్థ్యం తదితర అన్ని అంశాలను ఆయన పరీక్షించారు. హైలెవల్ ప్లాట్‌ఫామ్స్, ట్రాఫిక్ ఫెసిలిటీస్, బ్రిడ్జిలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కార్యాలయం, ప్యాసింజర్ల విశ్రాంతి భవనాలు, బ్రిడ్జి నిర్మాణం, సిగ్నలింగ్ వ్యవస్థ, ట్రాక్‌ను బ్రిజేష్‌కుమార్ తనిఖీ చేసి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజరు లలిత్ బోహ్రా, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్త, చీఫ్ బ్రిడ్జి ఇంజనీర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్‌వీఎస్ఎల్ పాత్రో, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో స్వచ్ఛోత్సవ్

బొబ్బిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమిషనర్ లాలం రామలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం గంట శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఫ్లైఓవర్‌పై ఫుట్‌పాత్ ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో ఏక్ దిన్.. ఏక్ సాత్.. ఏక్ గంట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో అల్లు భాస్కరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు. రెవెన్యూ కార్యాలయ ఆవరణలో జరిగిని కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీను మాట్లాడుతూ స్వచ్ఛత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్లు

రామభద్రపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ప్రతినిధి కొల్లి ఈశ్వరరావు సైకిళ్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆరు సైకిళ్లను అందజేశారు.